
జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 26 మే 2025
www.ntnews.com




# కళామయుని పలాయన లీల




శుక మహర్షి రాజర్షి పరీక్షిత్తుతో... 'యద్బిభేతి స్వయం భయం'- ఏ భగవంతుడంటే అందరినీ భయభ్రాంతుల్ని చేసే భయానికే భయమో, 'మృత్యుర్ధావతి పంచమః'- ఎవనికి భయపడి మృత్యువు కూడా పారిపోతుందో, అట్టి కాలకాలుడు, మాయాజాలకుడు (మాయ అనే వల పన్నువాడు), జగత్పాలకుడు వెన్నుడు- విష్ణువు పోరు చేయక వెన్నిచ్చి పారిపోతుంటే కాలయవనుడు అతని (శౌరి) వెంటపడ్డాడు. 'అఖిల కలాది గురుః'- అన్ని కళలకు, విద్యలకు ఆదిగురువు- ప్రవర్తకుడు, సమస్త లీలలకు, మాయలకు ఆలవాలం- నెలవు గోపాలకృష్ణుడే! విలక్షణమైన కృష్ణావతారంలో ఇదొక వినూత్న లీల- పలాయన లీల! కాలయవనుడు కృష్ణునితో... యదువరా! కంసాది మహాయోధులను వధించిన వీరుడవని విని నీతో అని (యుద్ధం) చేయదలచి వచ్చితిని. బెదురుపోతు- పిరికివాని వలె కదన రంగం వీడి పారిపోవద్దు. నేడు నిన్ను వదలను...

**మ|| 'బలిమిన్ మాధవ! నేడు నిన్ను భువన ప్రఖ్యాతిగా బట్టుదున్**
**జలముల్ సొచ్చిన, భూమి క్రింద జనినన్, శైలంబుపై నెక్కినన్**
**బలిదండన్ విలసించినన్ వికృతరూపంబుం బ్రవేశించినన్**
**జలధిం దాటిన నగ్రజన్మ హలికాశ్వాటా కృతుల్ దాల్చినన్.'**

'మాధవా! నీవు నీళ్లలో దాగినా (మత్స్యావతార సూచకం), నేల కింద దూరినా (కూర్మావతారం), కొండపై కెక్కినా (వరాహావతారం), రసాతలంలో బలి అండన చేరినా (వామనావతారం), వికృతరూపంలో ప్రవేశించినా (నృసింహావతారం), సముద్రం దాటినా (రామావతారం), అగ్రజన్మ (పరశురామ), హలిక (బలరామ), అశ్వట (కల్కి) రూపాలు ధరించినా, లోకంలో సుశ్లోకం- ప్రఖ్యాతి లభించేటట్లు నా బలిమితో నిన్ను పట్టుకుంటా.'

'శత్రుహంతా! అంతేకాక, ఇంతకూ నా వింటి నారి మోతలు నీకు వినిపించనే లేదు. నా బాణాలు నీ ఒంటిలో నాటనే లేదు. అయ్యో! అప్పుడే నువ్వు నవ్వుల పాలవుతూ దవ్వులకు- దూరంగా పారిపోతున్నావే! ఇలా అయితే మునుపు వాతాశి- గాలి మేపరి కాళీయుడితో, కేశితో, కరి- కువలయాపీడ గజంతో, చాణూర ముష్టిక మల్లురతో, జరాసుతునితో, అతులిత బల సంపన్నుడైన కంసునితో ఎలా పోరాడావు?' అంటూ యవనుడు జగదవనుని- లోకరక్షకుని వెంటనంటాడు. హరి కూడా ఆ తెంపరి- సాహసికుని పలుకులను సరకు- లెక్క చేయక, చిరునగవు మోమును వరింపగా 'త్వరపడకు రమ్ము, రమ్ము' అని హెచ్చరించాడు.

శుకయోగి- రాజా! 'ఇదిగో చిక్కాడు, అదిగో దొరికాడు' అని అరుస్తూ అవనీపతి- మ్లేచ్ఛ ప్రభువు కాలయవనుడు తనను పట్టడానికి ఉరుకుతూ రాగా కరి వరదుడు, ఉరుక్రముడు- విష్ణువు కుప్పించి ఎగిరేవాడు. 'ఇతడు అధిక జవనుడు- వేగం కలవాడు. వీనిని పట్టటమేమిటి? ముట్టటం కూడా వట్టి మాటేనేమో!' అని యవనుడు అనుకొన్నప్పుడు చట్టున- వెంటనే ప్రక్కన నిలిచేవాడు. అతడు బంధించడానికి ప్రక్కలకు అడ్డం వచ్చినప్పుడు కంసారి ఇటో అటో దూరి మోసగించి తప్పించుకొనేవాడు. పుట్టలు, గుట్టలు, చెట్టులు, చెరువులు అడ్డు వస్తే తడబడక- తత్తరపడక కుడి ఎడమలకు వడి- వడిగా పరుగులు పెట్టేవాడు. కల్ల (మోసం) చేస్తూ పల్లపు నేలలో కిక్కురుమనక- చప్పుడు చేయకుండా నక్కేవాడు. ఒక్కపెట్టున మిట్టలు- ఎత్తయిన దిబ్బలు ఎక్కి అబ్బుర- ఆశ్చర్య పరచేవాడు. జాడ తెలియక నీడలలో దాగి 'ఈడ ఈడ'- ఇక్కడ చూడు అంటూ యవనునికి గోడు (దుఃఖం) కలిగించేవాడు. మారుమూలల్లో తారాడేవాడు. కట్టకడకు, 'నన్ను పట్టుకొంటేనే నీవు గట్టి- గొప్ప మనిషివి' అంటూ అప్పుడు పురుషోత్తముడు కాలయవనుని ముప్పుతిప్పలు పెట్టాడు.

**సీ|| 'సకల భూతవ్రాత సంవాసుడయ్యును,**
**వనములు నగములు వరుస దాటు**
**లోకోన్నతుండును లోక చక్షుడునయ్యు,**
**మాటిమాటికి నిక్కి మగిడి చూచు**
**బక్ష విపక్ష సంబంధ శూన్యుండయ్యు,**
**దను విపక్షుడు వెంట దగుల నిగుడు**
**విజయాపజయ భావ విరహితుండయ్యు దా,**
**నపజయంబును చెందినట్లు తోచు**
**ఆ|| నభయ భయ విహీనుడయ్యు భీతుని మాడ్కి**
**గానబడును సర్వకాల రూపు**
**డయ్యుగాల చకితుడైన కైవడి వన**
**మాలి పరచు వెరపు మాలి యధిప!'**

శుకుడు- రాజా! అన్ని జీవులలో తాను ఉన్నవాడైనా ఆ వాసుదేవుడు వనాలు, పర్వతాలు వరుసగా దాటేవాడు. అన్ని లోకాలలో ఉన్నతుడు- మిన్న, లోకాలన్నిటికీ 'కన్ను' వంటివాడైనా, అక్కజం (ఆశ్చర్యం) కలిగిస్తూ మాటిమాటికి నిక్కి చూసేవాడు. స్వపర భేదాలు, బంధాలు లేనివాడైనా విరోధం పూని వెంటాడితే కంటపడక దాగేవాడు. జయాపజయాలు లేనివాడైనా తాను పరాజయం పాలైనట్లు పొడ చూపుతాడు- కనిపిస్తాడు. భయాభయాలకు అతీతుడైనా పగవారికి- శత్రువులకు భీతుని వలె అగపడతాడు. కాలాత్మకుడైనా వనమాలా విభూషితుడు, ఘనశ్యాముడు కృష్ణుడు కాల ధర్మానికి- మరణ రూపుడైన యవనునికి చాలా కలత (కలవర) పడుతున్న వాని వలె కనిపిస్తూ కలక (భయం) లేక పరుగెత్తాడు. 'నైనం ప్రాపాహతాశుభః'- అంతరంగంలోని అశుభ వాసనలు ఇంకా గిట్టని- సాంతం నశించని కారణంగా యవనుడు ఆశించినా కేశవుని పట్టలేకపోతున్నాడట!- ఇది శుకయోగి విశ్లేషణ. పై మత్తేభ, సీస పద్యాల కథా భాగం మహాభాగుడు పోతన ప్రసంగానుకూలంగా రసోదంచితంగా పెంచి రచించినది. 'తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే, తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః' (ఈశోపనిషత్తు). (శ్రీకృష్ణరూప ఆత్మ దృశ్య పదార్థరూపంగా చలిస్తుంది. వాస్తవంగా- అధిష్ఠాన దృష్టిచే చలించదు. అజ్ఞానులకు అది ఎంతో దూరం. సుజ్ఞానులకు ఎంతో సమీపం- సాక్షాత్ స్వరూపమే. ఆ ఆత్మ బాహ్యాభ్యంతరములందు కూడ వ్యాపించి ఉంది) ఈ ఉపనిషద్వాక్యాలు చేసే ధ్వనికి పురాణం కావించే ప్రతిధ్వనియే విస్తృతమైన పై వర్ణన.

శుకుడు- పరీక్షిన్మహారాజా! ఈ విధంగా శత్రువుల భవనాలను భేదించిన వాడు, పవనుని- గాలిని మించిన జవం (వేగం) కలవాడూ అయిన కాలయవనుణ్ని దూరంగా తీసుకుని పోయి, భయంకరమైన ఒక పర్వత గుహలో వడివడిగా ప్రవేశించి అదృశ్యమైపోయాడు కవ్వడి (అర్జున) సఖుడు కృష్ణుడు. మథురా నగరికి షుమారు 70- 80 మైళ్ల దూరంలో ఉన్న ధౌల్‌పూర్ (ధవళపురం) గ్రామానికి రెండు, మూడు మైళ్ల దూరంలో ఉన్నది 'ముచుకుంద గుహ' అన్నారు వ్యాఖ్యాతలు.

అంతట, కాలయవనుడు కూడా హరి అడుగుజాడలను అనుసరిస్తూ సరాసరి ఆ గిరి గుహలో చొరబడ్డాడు. మూఢుని- మోహగ్రస్తుని హృదయం వలె అజ్ఞాన అంధకార బంధురమైన ఆ గుహలో విశాలమైన శయ్యపై గురకపెడుతూ గాఢనిద్రలో ఉన్న ఒక అయ్యని- మహాపురుషుని కని, అతడే కృష్ణుడని అనుకొని... 'ఓరీ పురుషాధమా! యుద్ధావనిలో నాతో పోరు మాని, నడవడానికి కూడా వీలుగాని ఈ భయంకరమైన దారిలో పారి- పరుగెత్తి వచ్చి, ఈ కొండగుహలో దూరి నిద్రిస్తున్నవాని వలె నటిస్తున్నావు. నిన్ను పోనిస్తానని అనుకుంటున్నావా? నీవు ఎక్కడా ఎవ్వరికీ చిక్కవని చొక్కపు- స్వచ్ఛమైన మనసుగల నారదముని మున్ను చెప్పగా విని ఉన్నాను. నాకు చిక్కావు. ఇక ఎక్కడికని వెళ్తావు? నిన్ను నిక్కంగా ఇక్కడే, ఈ కొండగుహలోనే నిండైన- పెద్ద నిద్దుర పుచ్చుతా' అంటూ ఆ దుండగీడు పోగాల యవనుడు వికృతంగా నవ్వి, నిద్రిస్తున్న ఆ భద్ర పురుషుణ్ని వజ్రాయుధం వంటి కఠినమైన తన కాలితో బలంగా తన్నే దుష్కృత్యానికి ఒడిగట్టాడు. ఆ తన్నుతో నిద్రాభంగం కాగా ఆ పురుషుడు ఒళ్లు విరుచుకుంటూ తిన్నగా కళ్లు తెరచి కాళ్లవద్ద నిలుచున్న కాలయవనుణ్ని తన కరాళ క్రోధాగ్ని జ్వాలలలో అలవోకగా- అవలీలగా భస్మం చేశాడు.

శుకుడు- రాజా! ఆ పుణ్య పురుషుడు ఇక్ష్వాకు వంశ భవుడైన మాంధాత చక్రవర్తి కుమారుడు 'ముచుకుంద' మహారాజు. గొప్ప గోవిందభక్తుడు. ఒకప్పుడు ఆయన ఎంతో కాలం స్వర్గంలో ఉండి దానవులకు భయపడిన దేవతలను సంరక్షించాడు. వారు సంతసించి ఆ వీరాగ్రేసరునితో... మోక్షమివ్వడానికి నారాయణుడు తప్ప మేము అధికారులం కాము. అది తప్ప మరే వరమైనా కోరుకో ఇస్తామన్నారు. శ్రాంతుడైన- అలసి ఉన్న ముచుకుందుడు చిరకాల విశ్రాంతి- నిద్రను కోరుకున్నాడు. కాలయవనుడు కాలి బూడిదైన పిదప ముకుందుడు హరి ముచుకుందుని కనుల ముందు నిలిచాడు. జాడ తెలియక పోయినా చూడ ముచ్చటగా ఉన్న కాంతిమంతమైన ఆ రూపాన్ని చూచి ఆ ప్రోఢ- మహనీయుడు ముచుకుందుడు భ్రాంతికి లోనై ప్రీతితో ఇలా పలికాడు...

**మ|| 'శశివో? యింద్రుడవో? విభావసుడవో? చండ ప్రభారాశివో?**
**శశి చూడామణివో? పితామహుడవో? చక్రాంక హస్తుండవో?**
**దిశలున్ భూమియు మిన్ను నిండె నిదె నీ తేజంబు జూడంగ దు**
**ర్వశమై? యెవ్వడ? వేల వచ్చితిచటన్ వర్తించెదేకాకియై'**

'మహాత్మా! నీవు చంద్రుడవో, మహేంద్రుడవో, అగ్ని భట్టారకుడవో, ఆదిత్యుడవో, చంద్రచూడు- శంకరుడవో, వాణీపతివో లేక చక్రపాణివో నాకు తెలియడం లేదు. కన్నులకు మిరుమిట్లు గొలిపే నీ తేజం మిన్ను, మన్ను, అన్ని దిక్కులా నిండి ఉంది. నీవెవడవు? ఇచట వంటరిగా ఎందుకున్నావు? మహానుభావా! నేను నీ సేవాభాగ్యం కోరుతున్నా. దేవతల మేలు కొరకు బహుకాలం మేలుకొని ఉన్నందున, నన్నేలు దొరా! నేను బడలికతో ఒడలు మరచి నిద్రలో మునిగి, ఇంద్రియ వ్యాపారాలు విస్మరించి ఉన్నా. నాకు నిద్రాభంగం చేసిన వాడెవడో, తన పాపం వల్లనే నీఱైపోయాడు. శరణాగత వత్సలా! కరుణతో కూడిన చూపులతో నన్ను కటాక్షించు' (సశేషం)




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

# పరిగెత్తే గుర్రం

ఓ రాజ్యపు రాజు మానసిక అశాంతికి గురయ్యాడు. 'అశ్వమేధ యాగం అయినా చేయవచ్చు కానీ మనసును జయించలేం' అని విని ఉండటంతో ఆయన ఆందోళన మరింత ఎక్కువైంది. ఆయుర్వేద వైద్యం తీసుకుని ఆందోళన తగ్గించుకోవాలని భావించాడు రాజు. మందులు తీసుకోవడం కన్నా ఆస్థాన గురువును సంప్రదిస్తే మంచిదని రాణి సలహా ఇచ్చింది. ఆ మేరకు మానసిక ప్రశాంతత కోసం మార్గం సూచించమని ఆస్థాన గురువును అడిగాడు రాజు. రాజ్యంలోని దక్షిణ కొండల కింద ఉన్న శివాలయానికి నలభై రోజులపాటు వెళ్లి వస్తే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సలహా ఇచ్చాడు గురువు. మరుసటిరోజునుంచీ రాజు గుడికి వెళ్లి రావడం ప్రారంభించాడు. రోజులు గడుస్తున్నా రాజుకు తేడా ఏమీ కనిపించలేదు. కొన్నిరోజుల తర్వాత మళ్లీ గురువును కలిసి గుడికి వెళ్లి వస్తున్నా మానసిక ఆందోళన తగ్గడం లేదని వాపోయాడు. గురువు చిన్నగా నవ్వి 'మీరు గుడికి ఎలా వెళ్లి వస్తున్నారు?' అని ప్రశ్నించాడు. 'గుర్రం మీద వెళ్లి దర్శనం చేసుకుని వచ్చేస్తున్నాను' అని బదులిచ్చాడు రాజు. 'పరిగెత్తుతున్న గుర్రంపై నుంచి ఎవరైనా దూకగలరా?' అని అడిగాడు గురువు. 'అదెలా సాధ్యం? పొరపాటుగా ప్రయత్నించినా గాయాలపాలవుతాం కదా!' అన్నాడు రాజు. 'అంటే... గుర్రం నిలిచాకే మనం దిగడం ఉత్తమం అన్నమాట. మీరు గుడికి ప్రశాంతంగా వెళ్లి రావడం లేదు. హడావుడిగా గుర్రం మీద వెళ్లి వస్తున్నారు. కొద్దిసేపు కూడా గుడి ప్రాంగణంలో ప్రశాంతంగా కూర్చోవడం లేదు. గబగబా వెళ్లి గబగబా వచ్చేస్తే మీ ఆందోళన ఎలా మాయమవుతుంది? ఎన్ని పనులున్నా దేవాలయానికి ప్రశాంతంగా వెళ్లాలి. రోజువారీ గొడవలు, గందరగోళాలను పక్కన పెట్టాలనే కదా అక్కడికి వెళ్తున్నాం. అందుకని ఓపికగా ఉండాలి. కొద్దిసేపైనా ఆలయ ప్రాంగణంలో గడపాలి. అప్పుడే మీ ఆలోచనల ఉధృతి తగ్గుతుంది' అని సలహా ఇచ్చాడు. 'నిజమే... గురువు చెప్పాడని ఏదో మొక్కుబడిగా వెళ్లి వస్తున్నాను. గుడి అంటే దేవుడిని చూసి రావడమే కాదు, గుడి ప్రాంగణంలో గడపడం కూడా ముఖ్యం' అని గుర్తించాడు రాజు. అప్పటినుంచి ఏమాత్రం హడావుడి లేకుండా ప్రశాంతంగా గుడికి వెళ్లి రావడం ప్రారంభించాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

కథాసుధ




# ఇంద్రియాలకు ప్రభువు

ఉపనిషత్ వాక్యం

'భూయాన్యధావా అరా నాభౌ సమర్పితా ఏవ మస్మిన్ సర్వం సమర్పితం...' అని ప్రతిపాదిస్తున్నది ఛాందోగ్య ఉపనిషత్తు. శరీరంలోని అవయవాలు, ఇంద్రియాలన్నీ ఒక బండి ఇరుసుకు ఆకులు జోడించి ఉన్నట్టు.. ప్రాణానికి అనుసంధానమై ఉన్నాయి. దీన్ని నిరూపించే ఒక సన్నివేశాన్ని చెప్పుకొందాం.

ఒకరోజు శరీరంలోని ఇంద్రియాలన్నీ సమావేశమయ్యాయి. అందులో ప్రాణం కూడా పాల్గొన్నది. ముందుగా కళ్లు మాట్లాడుతూ 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం.. అన్నారు. నేను గానీ పని చేయకపోతే శరీరం కూలిపోతుంది' అని అన్నాయి. 'సరే.. మీరు పని మానేయండి. చూద్దాం' అన్నాయి మిగతా అవయవాలు. అంతే, కళ్లు కనపడటం మానేశాయి. అందరూ 'అయ్యో పాపం.. కళ్లు లేని కబోది..' అంటూ జాలిపడి సాయం చేస్తున్నారు.




అతనికి జీవితం ఇప్పుడే బాగుందిలే అనిపించింది. తర్వాత కాళ్లు మాట్లాడుతూ 'మనిషికి ఎంతో అవసరమైనవి కాళ్లు. అవి లేకపోతే జీవితమే దుర్భరం' అన్నాయి. 'సరే మీరు పనిచేయకండి' అన్నాయి మిగిలినవి. మర్నాటి నుంచి చూసిన వాళ్లంతా 'అయ్యో కాళ్లు లేవు. పాపం కుంటివాడు' అని జాలితో మూడు చక్రాల బండి ఇచ్చేవాళ్లు, ఉద్యోగం చూపించేవాళ్లు తయారయ్యారు. జీవితం కాళ్లున్నప్పటి కన్నా మెరుగే అనిపించింది. తర్వాత చెవులు, నోరు అన్నీ బయటికి వెళ్లి గమనించాయి. తేడా లేకుండా శరీరం జీవించి ఉండటం చూసి విస్తుపోయాయి. చిట్టచివర 'నేను కూడా ఒకసారి బయటికి వెళ్లి చూస్తాను' అన్నది ప్రాణం. అనుకున్నదే తడవుగా శరీరం నుంచి నిష్క్రమించడానికి ప్రయత్నించింది. అంతే. అవయవాలన్నీ సత్తువ కోల్పోసాగాయి. ప్రాణాన్ని బయటికి పోవద్దని బతిమలాడాయి. ప్రాణం తన ప్రయత్నాన్ని విరమించగానే సమస్త ఇంద్రియాలూ క్రమంగా పుంజుకున్నాయి. దీంతో ఇంద్రియాలన్నీ ప్రాణాన్ని కొనియాడాయి. శరీరంలో ఆత్మకన్నా ఒక మెట్టు కిందుగా ఉండేది ప్రాణం. అది ఆత్మకు నీడ అనుకోవచ్చు. ఆత్మ సాక్షి మాత్రంగాను ప్రాణం చేతన శక్తిగాను ఉంటాయి. ప్రాణం నిర్విరామంగా పనిచేస్తూ ఇంద్రియాలకు అవయవాలకు అంతర్ ఇంద్రియమైన మనసుకూ శక్తినిస్తుంది. ఒక్క ప్రాణం తప్పుకొంటే.. శరీరం కుప్పకూలిపోతుంది.

... డా|| వెలుదండ సత్యనారాయణ

# అపోస్తుల కార్యాలు

క్రీస్తు సందేశం

ప్రభువు వాక్కు లోకానికి అందించడానికై పంపబడిన వారే అపోస్తులు. అపోస్తులు, అపోస్తులురు అనేవి వాడుకలో ఉన్న పదాలు. అపోస్తుల కార్యాలు బైబిల్లో ఓ గ్రంథం. ఇది ఏసుక్రీస్తు పరలోకానికి వెళ్లిన తర్వాత, అపోస్తులుల ద్వారా దేవుని రాజ్యానికి సంబంధించి, ఆయన సువార్తను వ్యాప్తి చేసిన తొలినాళ్లల్లో పాటుబడ్డ సంఘం, దాని సమస్యలు, దాని క్రమేణ పరివ్యాప్తి గురించి తెలుపుతుంది. ఈ గ్రంథం సువార్తా చతుష్టయంలో ఒకరైన లూకా మహనీయుడు రాశారు. ప్రభువు విడిచిన కార్యాలకు ఇంపైన కొనసాగింపు ఇందులోని విషయం. అపోస్తుల కార్యాల్లో ఏసుక్రీస్తు నలభై రోజుల పాటు తన శిష్యులతో ఉంటూ.. వాక్య వ్యాప్తిపై చర్చిస్తూ, ఆ తరువాత ఆయన పరలోకానికి వెళ్లడం గురించిన విషయాలు, అపోస్తులుల ద్వారా సంఘం ఏర్పాటు చేయడం, అన్య విశ్వాసులకు కూడా సువార్త ఎలా అందించాలో నేర్పించడం ఇవన్నీ ఈ గ్రంథంలో పొందుపరిచి ఉన్నాయి. ఈ పని కోసం ప్రభువు శిష్యులు, శిష్యేతరులూ ఇంకా ప్రేరేపితులు ఎందరెందరో క్రీస్తు ద్వారా పంపడం ఇవన్నీ ఈ గ్రంథంలో చూడొచ్చు. సువార్త వ్యాప్తి గురించి ప్రస్తావించుకుంటే.. అపోస్తులుల ద్వారా సువార్త ఆనాటి ఎరుషలేం నగరం నుంచి రోమ్ నగరి వరకు వ్యాపించింది. అపోస్తులులో ప్రభువు శిష్యుడు



పేతురు, తనకు తాను అపోస్తులునిగా ప్రకటించుకొన్న ప్రభువు శిష్యేతరుడు పౌలు వీరిద్దరూ ఉంటారు. ఈ అపోస్తులుల కార్యాలకు వీరిద్దరు ప్రధాన పాత్రలే కాక, నడిపించిన రెండు నిండు ప్రాణభూతాలు! వీరి కార్యాలు ఓ పట్టు సడలని దీక్షతో ప్రభువు సూచిత గమ్యోన్ముఖంగా కొనసాగాయి. దేవుని ప్రజలు, వీరికి ఎలా సహకరించి, కలిసి పనిచేశారో, తెలియజేసేదే ఈ 'అపోస్తులుల కార్యాలు' అనే గ్రంథం. క్రీస్తు కాలానికి మహోధృతంగా సాగిపోయే యూదా మత సిద్ధాంతాలకు దీటుగా పయనించడానికి ఈ అపోస్తులులు పడిన శ్రమలన్నీ ఇందులో నిక్షిప్తమయ్యాయి.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024


# ఆరోగ్యంగా ఉన్నప్పుడే..

మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడు చేసే దాన ధర్మాలే నిజమైనవి. మంచి పనులు చేయాలని భావించి దానికి కట్టుబడి ఉండాలి. తన శక్తి మేరకు దైవ మార్గంలో ధనాన్ని ఖర్చు పెట్టాలి, దానాలు చేయాలి. మంచి పనులు చేస్తూ చనిపోతే తగినంత పుణ్య ఫలం వస్తుంది. అయితే జీవితమంతా మంచిపనులు, దానాలు




చేయకుండా కేవలం ముసలితనంలో, మరణ దశలో చేయడం సత్ఫలితాలను ఇవ్వవు. అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన మార్గంలో పోరాడటం, దానం చేయడం ఉత్తమమైన సత్కార్యం. పని రాని వాళ్లకు పనిచేసి పెట్టడం, పనిచేసే వాళ్లకు సాయపడటం కూడా పుణ్య ఫలితాన్ని కలిగించేవే. ప్రతి తస్బీహ్ పలుకు ఒక సత్కార్యమే. అల్లాహ్‌ను కీర్తించడం, మంచిని ఆదేశించడం కూడా మంచిపనులే. సాటివారిని నవ్వుతూ పలకరించే మంచి నడవడిక కూడా మంచిపనే. ఇతరులను మాటలతో కాని, చేతలతో కాని హింసించకుండా ఉండటం కూడా గొప్పపనే. అందరూ ప్రార్థనలు చేసే మసీదులను శుభ్రం చేయడం దైవానికి ఇష్టమైన మంచిపని. ఇతరుల కోసం, భావితరాల కోసం పండ్ల చెట్లను నాటడం ఎంతో పుణ్యకార్యం. కష్టపడి చేసిన సత్కార్యానికి పుణ్యఫలం ఎక్కువగా ఉంటుంది. మన దగ్గర ఉన్న గుక్కెడు మేకపాలతో ఇతరుల దాహార్తి తీర్చినా పుణ్యప్రదమే. మంచి మనసుతో ఒక్క ఖర్జూరపు ముక్క దానం చేసినా మనం నరకాగ్ని నుంచి తప్పుకోవచ్చు. భూతదయ కలిగి ఉండటం, నలుగురు నడిచే బాటను శుభ్రం చేయడం, నమాజు కోసం మసీదు వైపు వేసే అడుగులు, ఇతరుల తగాదా పరిష్కరించడమూ మంచిపనుల ఖాతాలోకే వస్తాయి.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076



# త్రిగుణాలకు ప్రతీకలు

**దీపారాధనలో ఎన్ని వత్తులు ఉంచాలి? ప్రత్యేకంగా ఈ దైవానికి ఇన్ని వత్తులు వేయాలనే నియమం ఏమైనా ఉన్నదా?**

• **సాయిలీల,** నర్సాపూర్

శ్లో|| సాజ్యం త్రివర్తి సంయుక్తం వహ్నినా యోజితం ప్రియం
గృహాణ మంగళం దీపం త్రైలోక్య తిమిరాపహమ్||
భక్త్యా దీపం ప్రయచ్ఛామి దేవాయ పరమాత్మనే
త్రాహిమాం నరకాత్ ఘోరాద్దివ్య జ్యోతిర్నమోఽస్తుతే||

అని పఠిస్తూ నిత్యపూజలో దీపాన్ని వెలిగిస్తారు. ముందుగా దీపారాధన చేయడమనేది షోడశోపచార పూజలోనూ, నిత్య దేవతా పూజలోనూ ప్రధానమైన ప్రక్రియ. దేవుడికి సమర్పించే దీపంలో మూడు వత్తులు ఉండాలని పైశ్లోకం వివరిస్తుంది. ఈ మూడు వత్తులు ముల్లోకాలకూ, సత్వ, రజో, తమో గుణాలకూ, త్రికాలాలకూ సంకేతంగా చెబుతారు.

దీపం అంటే వెలుగు, కాంతి, జ్ఞానం అని భావం. 'ఓ దైవమా! మూడు లోకాల చీకట్లను పోగొట్టగలిగిన దీపాన్ని వెలిగించాను. ఓ పరమాత్మా! నీకు ఎంతో ఇష్టమైన నేతితో కూడిన మూడు వత్తులతో కూడిన దీపమిది. దీన్ని అగ్నితో వెలిగించి భక్తితో నీకు నివేదిస్తున్నాను. ఈ దీపాన్ని స్వీకరించి నన్ను అనుగ్రహించు. భయంకరమైన నరకం నుంచి రక్షించగలిగిన దైవ స్వరూపమూ, మహిమాన్వితమూ అయిన ఈ జ్యోతికి నమస్కరిస్తున్నాను' అని ఈ ప్రార్థన భావం. పండుగ రోజులలో మాత్రం కుటుంబ సంక్షేమం కోసం స్త్రీలు వెలిగించే దీపానికి ఐదు వత్తులుండాలని ఒక విశ్వాసం ఉంది. కానీ, దేవతల రూపాలను అనుసరించి వత్తుల సంఖ్యలో మార్పులుండాలనే నియమమేదీ లేదు. దీపంలో మూడు వత్తులు వేయాలనేదే శాస్త్ర ప్రమాణం.

... శ్రీ